నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 19 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

గిరిజన హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్

టైగర్ కారిడార్ పేరిట అడవిబిడ్డలను బయటకు పంపే కుట్ర

- జీవో 49ను రద్దు చేసే వరకూ ఉద్యమం ఆగదు
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తున్నదని, పచ్చని తెలంగాణలో చిచ్చు పెడుతున్నదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం టైగర్ కారిడార్ పేరిట అడవిబిడ్డలను బయటకు పంపే కుట్ర పన్నుతున్నదని, వారు జీవనోపాధి కోల్పోయేలా తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆది నుంచి ఆదివాసులపై కపట ప్రేమ చూపుతున్నదని, ఆనాడు ఇంద్రవెల్లిలో ఆదివాసీలను కాల్చి చంపారని గుర్తు చేశారు. నేడు జీవో 49తో వారికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 49ను వెంటనే రద్దు చేయాలని, లేదంటే కుమ్రం భీం స్ఫూర్తితో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గిరిజన మంత్రి సీతక్క ఈ సమస్య పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తో మాట్లాడుతున్న బాధితుడు పనాస గణేశ్

బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

రోజు రోజుకూ కాంగ్రెస్ నాయకుల ఆగడాలు మితిమీరుతున్నాయి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని పాతిపెట్టాలి
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- బెల్లంపల్లి భూవివాదంలో గాయపడ్డ వారికి పరమార్శ

మంచిర్యాల అర్బన్, జూన్ 18 : కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేదేలేదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హెచ్చరించారు. మంగళవారం బెల్లంపల్లిలో జరిగిన భూ వివాదంలో గాయపడి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్సపొందుతున్న పాత బెల్లంపల్లికి చెందిన పనాస గణేశ్, పనాస లక్ష్మిని ఆయన పరమార్శించారు. గొడవకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజు రోజుకీ మితిమీరిపోతున్నాయన్నారు. గడ్డం ఫ్యామిలీకి మంత్రి పదవి ఇచ్చిన తర్వాత చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గంలో దాడులు ఎక్కువయ్యాయన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వినోద్ అండ చూసుకొని బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పనాస గణేశ్.. అతడి కుటుంబసభ్యులపై మంగళవారం రాత్రి కాంగ్రెస్ గూండాలు, మాజీ జడ్పీటీసీ రాంచందర్ అనుచరులు ఆయుధాలతో దాడి చేశారన్నారు. కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లో సైతం బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, అక్కడి పోలీస్ వ్యవస్థ ప్రేక్షకపాత్ర వహిస్తున్నదని, వాళ్లే దాడులు చేసి వాళ్లే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. గత 30 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఎన్నో పార్టీలు, ఎన్నో ప్రభుత్వాలు మారాయని, ఏ ప్రభుత్వంలో ఉన్నా.. అధికారులు 60 శాతం ప్రభుత్వానికి సపోర్ట్ చేస్తే.. 40 శాతం న్యాయానికి సపోర్ట్ చేస్తారన్నారు. కానీ, ఇప్పుడున్న పరిస్థితులు.. ఎప్పుడూ చూడలేదని.. ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ వాళ్లు ఏది చెబితే.. అదే చేస్తున్నారు తప్ప చట్టం, న్యాయం, ధర్మం చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇదే పద్ధతి తాము చేసుంటే కాంగ్రెస్ వాళ్లు ఎవ్వరూ ఉండేవారు కాదని, కనీసం బొక్కలగుట్ట దాటేవారు కాదని వెల్లడించారు. రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తున్నదని, బీఆర్ఎస్ నాయకత్వంపై ఈడీ కేసులు పెట్టించి, నోటీసులిచ్చి ఇబ్బందుల పాలు చేస్తున్నారని, అదే పద్ధతిలో నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అరాచకం చేస్తున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి.. కాంగ్రెస్ అభ్యర్థులను పాతాల లోకంలో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. రామగుండం సీపీ ఈ ఘటనపై విచారణ జరిపించి దోషులపై చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పల్లె భూమేశ్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జంగల్ సఫారీకి కొత్త వాహనాలు

హాజీపూర్, జూన్ 18 : లక్షెట్టిపేట రేంజ్ పరిధిలోని పాత మంచిర్యాల, తిమ్మాపూర్ ఫారెస్టు బీట్‌లలోని ఎంసీసీ క్వారీలో జంగిల్ సఫారీకి బుధవారం కొత్త వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డివిజనల్ ఫారెస్టు అధికారి సర్వేశ్వర్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన వాహనాల్లో అత్యాధునిక సౌకర్యాలున్నాయని, ఇవి పర్యాటకులకు సురక్షితమైనవన్నారు. ఈ వాహనాలు ఎలాంటి శబ్దం రాకుండా ఉండడంతో జంగల్ సఫారీలో సందర్శకులు జంతువులను మరింత దగ్గరగాచూసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఫారెస్టు రేంజ్ అధికారి అత్తె సుభాష్, సెక్షన్ అధికారి హతవుల్లా, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు రాజేందర్, స్వప్న తదితరులున్నారు.

జంగల్ సఫారీకి నూతనంగా వచ్చిన వాహనాలు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బెల్లంపల్లి, జూన్ 18 : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మంగళవారం రాత్రి వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో జేసీబీతో నేలమట్టం చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో దుకాణాల ముందు ఉన్న మెట్లు, ఇతర తాత్కాలిక నిర్మాణాలు కూల్చివేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. బజార్ ఏరియాలోని మిగతా చోట్ల కూడా తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

జీసీసీ మేనేజర్‌గా రాజ్‌కుమార్

జన్నారం, జూన్ 18 : మండల కేంద్రంలోని జీసీసీ సొసైటీ మేనేజర్‌గా ఎం రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్ బాలాజీని ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి మేనేజర్‌గా ఉన్న రాజ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.



సిండికేట్ దోపిడీ

బ్రాండెడ్ పత్తి విత్తనాలను బ్లాక్‌లో విక్రయిస్తున్న వ్యాపారులు

- కృత్రిమ కొరత సృష్టించి మరీ అమ్మకాలు
- రూ. 850 ఉన్న ప్యాకెట్‌ను రూ. 1200 వరకు పెంచేసి దండుకుంటున్న వైనం
- బిల్లులు ఇవ్వకుండా దబాయింపు
- కన్నెత్తి చూడని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పత్తి విత్తన దందాకు తెరలేపారు. డిమాండ్ ఉన్న సీడ్స్‌ను కృత్రిమ కొరత సృష్టించి మరీ బ్లాక్‌లో విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. రూ. 850 అమ్మాల్సిన 475 గ్రాముల ప్యాకెట్‌ను రూ. 1100 నుంచి రూ. 1200 వరకూ పెంచేసి అమ్ముతూ అందినకాడికి దండుకుంటున్నారు. నెల క్రితం వరకు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి హడావుడి చేసిన అధికారులు.. ప్రస్తుతం ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయం..

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 3.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఇందుకనుగుణంగా విత్తన ప్యాకెట్లు తెప్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇక ఇదే అదనుగా భావించిన వ్యాపారులంతా కుమ్మక్కై తమ వద్ద ఉన్న బ్రాండెడ్ పత్తి విత్తనాల ప్యాకెట్లను ఎక్కువ ధరకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు పత్తి విత్తనాల కోసం ఫర్టిలైజర్స్ షాపులకు పరుగులు పెడుతున్నారు. ఈ ప్రాంత రైతులు తులసీ, మహికో, కిలాడి, సంకేత్, సూపర్‌కాట్, సీసీహెచ్ 999, ఈవీఎస్ వంటి విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. దీనిని అవకాశంగా భావించిన వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. రూ. 850 విలువ చేసే 450 గ్రాముల పత్తి విత్తనాల ప్యాకెట్‌ను రూ. 1100 నుంచి రూ. 1200 వరకూ పెంచేసి అమ్ముతున్నారు. ఇక ఆర్థిక ఇబ్బందులతో ఉద్దెర తీసుకునే రైతుల వద్ద మరింత ఎక్కువ ధర తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

బిల్లులు ఇవ్వట్లేదు...

ఫర్టిలైజర్స్ వ్యాపారులు కుమ్మక్కై రెట్టింపు ధరలకు విక్రయిస్తుండగా, రైతులు గత్యంతరం లేక కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. బ్లాక్‌లో కొంటున్న పత్తి విత్తనాల ప్యాకెట్లకు వ్యాపారులు బిల్లులు, రసీదులు ఇవ్వడం లేదు. ఇష్టముంటే కొనండి.. లేకపతే పొండి అంటూ రైతులను దబాయిస్తున్నారు. విత్తనాలు దొరకవేమోనని ఆందోళనకు గురవుతున్న రైతులు విత్తనాలు కొనకతప్పడం లేదు. ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలవకపోయినా.. పెరగకపోయినా.. పూత.. కాయలు రాలిపోయి రైతులకు ఎలాంటి నష్టం వచ్చినా ప్రశ్నించే అవకాశం ఉండకుండా వ్యాపారులు జాగ్రత్త పడుతున్నారు.

నెల క్రితం వరకు హడావుడి..

నెల క్రితం వరకు ఫర్టిలైజర్స్ దుకాణాలు తనిఖీలు నిర్వహిస్తూ హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తున్నాయి. వ్యాపారులతో కుమ్మక్కవ్వడం వల్లే తనిఖీలు చేపట్టకుండా స్తబ్ధుగా ఉంటున్నట్లు తెలుస్తున్నది.

తాండూర్‌లో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన

తాండూర్, జూన్ 18 : తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటో వార్డు కొత్తగుడిసెలు కాలనీకి చెందిన మహిళలు బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డుపై ధర్నా చేశారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మహిళలు, కాలనీవాసులు మాట్లాడుతూ మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నుంచి మాకు అసలే నీళ్లు రావని, మా కాలనీ కోసం ఏర్పాటు చేసిన డైరెక్ట్ పంపింగ్ మోటర్లు ఎప్పుడూ కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వారం రోజులుగా తాగు నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాండూర్ కొత్త గుడిసెలు ప్రాంతానికి తాగునీటి సరఫరా సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి సముదాయించే ప్రయత్నం చేశారు. మిషన్ భగీరథ ఎస్ఈ కే రవీందర్, డీఈఈ ప్రవీణ్, ఏఈఈ శ్రీనివాస్, ఏఈ మనోహర్, ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు అప్పటికప్పుడు మోటర్‌కు మరమ్మతులు చేయించి తాగు నీరు సరఫరా చేశారు.

తల్లి గొలుసు దొంగిలించిన కొడుకు

రిమాండ్‌కు తరలింపు

మందమర్రి, జూన్ 18 : మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ రోడ్డులో గత నెల 24న జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు చేధించారు. కన్నతల్లి మెడలోని బంగారు గొలుసును దొంగిలించి గుర్తు తెలియని వ్యక్తులపై నెపం మోపిన కొడుకునే నిందితుడిగా తేల్చారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ వివరాలు వెల్లడించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసం ఉంటున్న విజయపురి పుల్లమ్మ(76) అనారోగ్యంతో బాధపడుతున్నది. గత నెల 24న రాత్రి సుమారు 7 గంటల సమయంలో మంచంలో పడుకొని ఉన్న ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. ఈ విషయమై మనుమడు శిశ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనితో మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక, మానవనరుల పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టగా బయటి వ్యక్తులు ఈ నేరం చేసి ఉండరని భావించారు. ఈ క్రమంలో వృద్ధురాలి కొడుకైన విజయపురి శంకరయ్య ప్రవర్తనపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తానే బంగారు గొలుసును దొంగిలించినట్లు అంగీకరించాడు. దీంతో అతడిని బుధవారం అరెస్ట్ చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు ఏసీపీ రవి కుమార్ తెలిపారు. అత్యంత చాకచక్యంగా కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, క్రైమ్ టీం కానిస్టేబుళ్లు మహేశ్, రాకేశ్ ఆయన అభినందించారు.



మందమర్రిలో వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్

సింగరేణికి జాతీయ స్థాయి పురస్కారం

శ్రీరాంపూర్, జూన్ 18 : సింగరేణి సంస్థకు అరుదైన గౌరవం లభించింది. సంస్థ అనుసరిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు గాను జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. 2024 సంవత్సరానికిగాను దేశంలో పార్లమెంట్ చట్టం కింద ఏర్పడిన చట్టబద్ధ ప్రతిష్టాత్మక సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) అందజేసే పురస్కారాలలో సింగరేణి సంస్థ తృతీయ బహుమతికి ఎంపికైనట్లు ఐసీఎంఏఐ అధ్యక్షుడు సీఎంఎ బిభూతి భూషణ్ నాయక్ పేర్కొన్నట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. కాగా, సింగరేణి సంస్థ జాతీయ పురస్కారానికి ఎంపిక కావడంపై సంస్థ సీఎండీ బలరాం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల్లో మెగా పరిశ్రమలు అనేకం ఉన్నప్పటికీ ఖర్చు నియంత్రణలో సింగరేణి సంస్థ సమర్థతకు మూడో స్థానం లభించడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ ఉద్యోగులు, అధికారులు సమిష్టి కృషి ఫలితంగానే పురస్కారం వరించిందన్నారు. ఈ 23న ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని స్వీకరిస్తామని చెప్పారు.

సింగరేణి సీఎండీ బలరాం

భయం భయంగా ..

- ఇజ్రాయెల్ దేశంలో మంచిర్యాల జిల్లా వాసుల ఆందోళన
- బాంబుల శబ్దంతో బంకర్లలో తలదాచుకుంటున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటూ ఎంబసీ నుంచి మెసేజ్‌లు

దండేపల్లి, జూన్18 : ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో తెలంగాణ ప్రాంతంలోని మంచిర్యాల జిల్లావాసులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడుపుతున్నారు. ఏ క్షణంలో ఎటువైపు నుంచి రాకెట్లు, లాంచర్లు దూసుకొస్తాయోనని వణికిపోతున్నారు. ఇటీవల జగిత్యాలకు చెందిన రవీందర్ బాంబుల దాడికి గుండెపోటుకు గురై మృతిచెందాడు. వందలాది మంది అక్కడి దేశస్థులు మృతి చెందుతున్నట్లు టీవీల్లో, సోషల్ మీడియాలో వార్తలు వెలువడడంతో ప్రవాసీ భారతీయుల కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. దండేపల్లితో పాటు జన్నారం, లక్షెట్టిపేట, తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 100 మందికి పైగా పారిశ్రామిక, నిర్మాణ, ఉపాధి రంగాల్లో, ఇండ్లల్లో పనులు చేస్తున్నారు.

సైరన్ మోగగానే బంకర్లలోకి వెళ్తున్నాం

ఉపాధి కోసమని వెళ్లిన దండేపల్లి మండలం తాళ్లపేట, గుడిరేవు, జన్నారం మండలం తపాల్‌పూర్, రోటిగూడ గ్రామాలకు చెందిన బ్రహ్మయ్య, రమేశ్, సతీశ్ అక్కడి పరిస్థితిని వివరిస్తూ 'నమస్తే'తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్‌లోని యెల్కానా ప్రాంతంలో ని వాసముంటున్న వారంతా క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు.ఇరాన్ ఎదురుదాడులతో ఇజ్రాయెల్‌లోని మన పౌరులు ఉలికిపాటుకు గురవుతున్న మాట వాస్తవమేనన్నారు. గత 4, 5 రోజుల నుంచి బాంబుల దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో బంకర్లలో తలదాచుకుంటున్నామన్నారు.10-15నిమిషాల ముందు సైరన్ మోగిస్తున్నారని, అప్రమత్తమై వెంటనే బంకర్లలోకి వెళ్లిపోతున్నామన్నారు. ఇండియన్ ఎంబసీ కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుందని, సేఫ్టీ జోన్‌లో ఉండాలని సూచిస్తుందన్నారు.ఇప్పటి వరకైతే కార్మికులకు సెలవులు ప్రకటించారన్నారు. ఈనెల 30 వరకు దేశ వ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించినట్లు తెలిపారు.

Embassy of India
Tel Aviv
***
Advisory / Notice (as on June 17, 2025)
In continuation of previous advisories, as the National Emergency in Israel continues to be in place, all Indian nationals are advised to stay vigilant and strictly adhere to safety advisories promulgated by the Israeli Home Front Command (https://www.oref.org.il/eng).
2. All Indian nationals intending to exit Israel may like to avail of the land border crossing options. Such travelers are advised to verify the operational timings, obtain appropriate visas and fees applicable at these border crossings at https://www.ica.gov.il/eng (See Note below).
3. The Indian nationals who continue to remain in Israel are advised to register themselves with the Embassy at the following link https://www.indianembassytelaviv.gov.in/indian_national/reg. if not done already.
4. Embassy helplines are operational 24/7 for any assistance regarding the present situation. Telephone: +972 54-7520711 or +972 54-3278392 Email: consul.telaviv@mea.gov.in
***
17 June 2025
Note:
1.Indian nationals can apply for eVisa to Jordan via e-services portal/app of the Hashemite Kingdom of Jordan Ministry of Interior (https://www.gov.jo/EN/Pages/Visa_E_Applications). Please ensure to read the instructions on the portal.

అప్రమత్తంగా ఉండాలంటూ ఎంబసీ నుంచి వచ్చిన మెసేజ్‌లు